# అంతర్జాతీయ ఉగ్రవాదం... పెనుభూతం

**అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదులు దాడి జరిపి (2001, సెప్టెంబర్ 11) ఏడేళ్లు నిండిన 48 గంటల్లోపే.. భారత దేశ రాజధాని ఢిల్లీలో వరుస పేలుళ్లు సంభవించి... జన నష్టం, ఆస్తి నష్టం జరిగింది. దీన్నిబట్టి తీవ్రవాదం అనే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్, బెంగుళూరు, అహ్మదాబాద్, జైపూర్‌లలో వరుస పేలుళ్ల తర్వాత... ఇప్పుడు రాజధాని ఢిల్లీకి కూడా ఈ ప్రకంపనలు వ్యాపించడంతో.. జాతి యావత్తు ఉలిక్కిపడింది!!**

భారతదేశంతోపాటు అనేక అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలు... తీవ్రవాదం సమస్యను ఎదుర్కోవటానికి తమతమ ప్రణాళికలతో సమాయత్తమవుతున్నాయి. ఈ తరుణంలో... అంతర్జాతీయ ఉగ్రవాదం సమస్యను అన్ని కోణాల్లో పరిశీలించి... దాన్ని నివారించటానికి, నిరోధించటానికి, నిర్మూలించటానికి చేపట్టాల్సిన చర్యలను సమీక్షించుకుంటూ.. సమస్యను సమూలంగా అరికట్టడానికి అనుసరించాల్సిన వ్యూహంపై... సమగ్ర విశ్లేషణ అవసరం.

టెర్రరిజం అనే పదం టెర్రరే (భయపెట్టటం) అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. హింసాత్మక పద్ధతుల ద్వారా.. ప్రజా సమూహాన్ని భయభ్రాంతుల్ని చేస్తూ... తాము ఎంచుకున్న సిద్ధాంత సహిత లేదా సిద్ధాంత రహిత లక్ష్యం దిశగా.. జనావళిని బలవంతంగా మరల్చటానికి గానీ.. లేదా వారి దృష్టిని ఆకర్షించటానికి గానీ చేసే వ్యక్తిగత లేదా సామూహిక చర్యలను టెర్రరిజం అనవచ్చు. అయితే, టెర్రరిజం అనే పదాన్ని ఎలా నిర్వచించాలనే విషయంపై... ప్రపంచ దేశాల మధ్య గానీ.. ఐక్యరాజ్యస మితిలో గానీ.. ఆయా దేశాలు అంగీకారానికి రాలేకపోవటం విచారకరం. వ్యక్తులు లేదా సంస్థలు బలప్రయోగం ద్వారా ప్రజల్ని, ప్రభుత్వాల్ని బెదిరించడం... తమ రాజకీయ, సైద్ధాంతిక, మతపరమైన లక్ష్యాల కోసం భయోన్మాదానికి పాల్పడటం... కొన్ని ప్రదేశాల్లో జన నష్టం, ఆస్తి నష్టం కలిగించటం... అక్కడి భద్రతా వ్యవస్థను దెబ్బ తీస్తూ.. మిగతా ప్రాంతాల్లోని ప్రజలను భయాందోళనలకు గురిచేయటం... సామూహిక భద్రతా వ్యవస్థను నిర్వీర్యం చేయాలనుకోడం-తదితర చర్యలను టెర్రరిస్టు చర్యలుగా పేర్కొనవచ్చు.



తీవ్రవాదానికి కారణాలు అనేకం. ఈ సమస్యతో అతలాకుతలమవుతున్న దేశాల్లో... ఆయా దేశాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, చారిత్రక పరిస్థితుల దృష్ట్యా... ఉగ్రవాదం పట్ల ఉన్న దృక్పథాన్ని విశ్లేషించాలి. ఎందుకంటే..? ఒక దేశ సార్వభౌమాధికారానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా.. హింసాత్మక పద్ధతుల్లో ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్న వారిని, బాధిత దేశం ఉగ్రవాదులుగా ప్రకటిస్తే.... ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నవారు, ఆ ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న దేశాలు.. వారిని పవిత్ర యుద్ధ సైనికులుగా, స్వాతంత్ర్య యోధులుగాను పేర్కొంటున్నాయి. అంతేకాకుండా తమ దేశ భూభాగాల్లో వారికి శిక్షణ ఇస్తూ... ఆయుధాలు, ఇతర అవస రాలకు కావలసిన ధనాన్ని సమకూరుస్తూ.. బాధిత దేశాల్లోని తీవ్రవాద సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. జమ్మూ- కాశ్మీర్‌లో కొనసాగుతున్న హింసాత్మక చర్యలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. అయితే, తీవ్రవాదంపై ఆయా దేశాల మధ్య స్పష్టమైన ఏకాభిప్రాయం లేదు. దాంతో.. ఈ సమస్యపై అంతర్జాతీ యస్థాయిలో వ్యవస్థీకృతమైన పోరు జరగక, ఉగ్రవాదం విస్తరిస్తోంది. ప్రజాస్వామ్య దేశాల్లో తీవ్రవాద సమస్య ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడనే ప్రశ్నిస్తుంటే.. ప్రజాస్వామ్యం లేని దేశాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఏకస్వామ్య పాలనలో.. ప్రజల మనోభావాల్ని గుర్తించకపోవటంతో రాజకీయ అధికారం కోసం.. తమకు నచ్చిన సిద్ధాంతాల స్థాపన కోసం.. ఉగ్రవాద చర్యలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి తోడు ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో... ప్రపంచంలోని చాలా దేశాలు రెండు అగ్రరాజ్యాల సరసన చేరటంతో.. ఆ సమయంలో ఈ సమస్య సంబంధిత దేశాల వరకే పరిమితమయ్యేది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత.. అమెరికా ఆధ్వర్యంలో ఏకధృవ ప్రపంచ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యం పెరుగుతూ వచ్చింది. తన విదేశాంగ విధానాలకు, తన ఆర్థిక అవసరాలకు, తన వ్యూహాత్మక ప్రణాళికలకు అనువుగా అమెరికా తీసుకున్న కొన్ని ఏకపక్ష నిర్ణయాలు... తత్ఫలితంగా

SAKSHI

తనకు నచ్చని పాలకులున్న దేశాలపై జరిపిన దాడులు, దురాక్రమణలు... దురాక్రమణకు గురైన దేశాల సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. ఇరాక్ సమస్య ఇందుకు ఉదాహరణ. అమెరికా దాడులకు గురైన దేశాల్లో ఉన్న పాలకులు, పాలితులు కూడా అమెరికాను ఒక దురాక్రమణదారుడిగా.. తన సంస్కృతిని, ఇష్టాఇష్టాలను ఇతర దేశాలపై రుద్ది, ఏకరూప సంస్కృతిని సాధించటానికి ప్రయత్నిస్తున్న సామ్రాజ్యవాద శక్తిగా భావించటంతో... అమెరికా, అమెరికాకు మద్దతు ఇస్తున్న పాశ్చాత్య దేశాల సంస్కృతిపై ద్వేషం పెరిగేలా పురికొల్పింది. తమ పాలకులపై జరిగిన దాడులను.. పాలకులపైనే కాకుండా తమ పైన, తమ మతంపైన, తమ విశ్వాసంపై జరిగిన దాడులుగా ఆయా దేశాల ప్రజల భావించటంతో... ఉగ్రవాదం రాజకీయ రంగం నుంచి, మతపర మైన రంగు పులుముకుంది. తమ దేశాలపై, తమ విశ్వాసాలపై, తమ మతాలపై దాడి చేసే హక్కు అగ్ర రాజ్యాలకు ఎవరు ఇచ్చారంటూ..? వ్యతిరేకత మొదలైంది. ఆ వ్యతిరేకతను బలోపేతం చేయటంలో ఆయా దేశాల్లోని అతివాద మూకలు సఫలమయ్యాయి. దాంతో తీవ్రవాద పునాదులు బలపడ్డాయి. అంతేకాక ఒకచోట ఉగ్రవాదమంటూ పోరాటం చేస్తున్న అగ్రరాజ్యాలు... అలాంటి సమస్యలనే మరొకచోట స్వపరిపాలనా సంగ్రామంగా పేర్కొంటున్నాయి. అగ్ర దేశాల ఇలాంటి ద్వంద్వ నీతి, పరిస్థితిని మరింత జఠిలం చేసింది. ఇలా విభిన్న కారణాల వల్ల అంతర్జాతీయ స్థాయిలో తీవ్రవాద సమస్య బలపడింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో దాడులకు పాల్పడుతున్న తీవ్రవాద సంస్థలు, సమూహాలు... తాము తమ లక్ష్య సాధనలో ముందుకెళుతున్నామని భావించవచ్చు. అయితే, దాడుల్లో బలయ్యే అమాయక ప్రజలకు.. తామెందుకు బలవు తున్నామో కూడా తెలియని విషాద పరిస్థితి! ఎంతో కష్టపడి తరతరాలుగా నిర్మించుకుంటున్న వ్యవస్థలను... ఛిన్నాభిన్నం చేయటానికి తీవ్రవాదులు చేసే ప్రయత్నాలను చూస్తే... బాధ్యత గల ఏ పౌరుడికైనా ఆగ్రహం, ఆవేదన కలుగక మానవు.

సమస్య మూలాల్లోకి వెళితే... ''ఆకలితో అలమటించే అసహాయులున్న గుడిసెల మధ్యలో ఉన్న ఏ భవనమూ సురక్షితం కాదు''అన్న జాన్ కెన్నడీ మాటలు గుర్తుకు వస్తాయి. ప్రపంచంలో ఎక్కడైతే పేదరికం ఉందో అక్కడ తీవ్రవాదానికి మద్దతు లభిస్తోందని విశ్లేషకుల అంచనా. అందరికీ అవకాశాలు కల్పించే బలమైన ఆర్థిక వ్యవస్థ... అందరికీ భాగస్వామ్యం కల్పించే పటిష్టమైన రాజకీయ వ్యవస్థ.. అందరికీ సమాన భద్రత కల్పించే సామాజిక వ్యవస్థ.. ఎక్కడైతే ఉండవో..? అక్కడ వ్యవస్థాపరమైన శూన్యత ఏర్పడుతుంది. వ్యవస్థాపరమైన శూన్యత ఎక్కడైతే ఏర్పడుతుందో..! అక్కడ ఆ శూన్యాన్ని పూరించటానికి రకరకాలు శక్తులు ప్రయత్నిస్తాయి. తీవ్రవాదం కూడా ఇలాంటి శక్తే. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలు లభించని యువత.. ఉగ్రవాదంవైపు ఆకర్షితులు అయ్యే ఆస్కారం ఎక్కువ.

ఒక రకమైన నమ్మకాల్నే, విశ్వాసాలనే అందరూ ఆచరించాలనే కొందరి మొండి వైఖరి వల్ల.... తమ విశ్వాసాలకు విఘాతం ఏర్పడుతోందని భావించే సమూహాలు వ్యతిరేకత వ్యక్తం చేయటమే కాక.. ఆ వ్యతిరేకతను వాడుకునే తీవ్రవాదుల చేతుల్లో పావులుగా మారే ఆస్కారముంది. అంతే కాక, తమను తాము పరిపాలించుకునే హక్కు, ప్రజాస్వామ్యం లేని దేశాల్లో అమలులో ఉన్న వ్యవస్థ పట్ల ఆగ్రహం కూడా తీవ్రవాదుల చర్యల వైపు ప్రజలను ఆకర్షింపచేస్తోందన్నది కొందరు విశ్లేషకుల అభిప్రాయం. జాతీయ స్థాయిలో బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉండి... అది క్రమంగా బలపడి, గ్రామ స్థాయి వరకూ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం జరిగితే.. భిన్న వర్గాల మధ్య నిర్మాణాత్మకమైన సంభాషణలు జరిగి.. గ్రామస్థాయి నుంచి పటిష్టమైన వ్యవస్థ తయారవుతుంది. అలాంటి వ్యవస్థలో ప్రజల అవసరాలకు తగ్గట్లు, సౌకర్యాలు అందే అవకాశం ఉంటుంది. దాంతో ఏ సమూహం కూడా తాము అలక్ష్యానికి గురయ్యామని భావించదు. అలక్ష్యానికి గురయ్యామనే ఆవేదన.. తమ విశ్వాసాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని గౌరవించటం లేదనే భావన వేర్పాటువాదానికి.. తద్వారా ఉగ్రవాదానికి ఊపిరిపోస్తోంది. గ్రామ స్థాయిలో పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడితే... ఈ అవకాశమే ఉండదు.

డా॥ బి.ఆర్.అంబేద్కర్ అన్నట్లు.. ప్రతి దేశానికీ రాజకీయ స్వాతంత్ర్యమే కాకుండా... సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ఎంతో అవసరం. సమాజంలో కొన్ని వర్గాలు వేగంగా అభివృద్ధి చెందుతూ... మరికొన్ని వర్గాలు ప్రగతి సాధించలేకపోతే.. అసూయ, ద్వేషం పెచ్చరిల్లి సామాజిక అశాంతి ప్రబలే ఆస్కారముంది. ఎన్ని ఆర్థిక సంస్కరణలు అమలైనా.. ఆర్థికాభివృద్ధి ఫలాలు ఏ కొన్ని తరగతులకో, వర్గాలకో మాత్రమే అందితే.. ఫలాలు అందని వర్గాల్లో, తరగతుల్లో ఆక్రోశం ఆవరిస్తుంది. ఈ ఆక్రోశాన్ని, సామాజిక అశాంతిని, సరైన దృక్కోణంలో అర్థం చేసుకొని నివారించే ప్రయత్నం జరగకుంటే... మొక్కస్థాయిలో ఉన్న తీవ్రవాద సమస్యకు ఎరువు అందించినట్లే. సిద్ధాంతాలు ఏవైనా.. లక్ష్యాలు ఉన్నా, లేకపోయినా... ప్రపంచంలో జరిగే అన్ని తీవ్రవాద దాడుల్లోనూ ప్రముఖ పాత్ర పోషిస్తున్నంది ఆయా ఆర్థిక వ్యవస్థలో అవకాశాలు అందని నిరుద్యోగ యువతే. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఏర్పడుతున్న వ్యవస్థాపరమైన శూన్యతను తక్షణం పూరించకుంటే... ఆ శూన్యంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాద వ్యవస్థ... మిగిలిన అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రమాదముంది.బలమైన వ్యవస్థలు ఏర్పడటానికి మూలం.. బాధ్యత కలిగిన పౌరసత్వ సంస్కృతి. ప్రాథమిక స్థాయి నుంచి విద్యా వ్యవస్థలో నిర్మాణాత్మకమైన మార్పులు తెచ్చి... బలమైన

సమసమాజ నిర్మాణం ద్వారానే ఇది సాధ్యం.

ఉగ్రవాదం లక్ష్యం... విజయం సాధించటం కంటే కూడా భయాన్ని సృష్టించటమే! భయం ద్వారా ప్రజలు ఆలోచించే విధానాన్ని.. సమస్యకు ప్రతిస్పందించే పద్ధతిని మార్చటం. బలమైన పౌరసత్వ సంస్కృతి కలిగిన ప్రజాస్వామ్య వ్యవస్థలో.. పరిపక్వత కలిగిన పౌరులు.. పరిణతితో ప్రతిస్పందించి, ధైర్యంగా ధీటుగా స్పందిస్తే... ఎలాంటి ఉగ్రవాదమైనా తలవంచక మానదు. పంజాబ్‌లో ఉగ్రవాద నిర్మూలనే దీనికి ఉదాహరణ. ఉగ్రవాద చరిత్రలో విజయం సాధించిన దాఖలాలు లేవు. అల్‌ఖైదా అయినా, ముజాహిదీన్ అయినా, ఎల్‌టీటీఈ అయినా, బాస్కూ తీవ్రవాదులైనా... వారి చర్యలతో భయాందో ళనలను సృష్టించగలరేమో కాని.. విజయం సాధించ లేరు. అయితే, శాస్త్ర పరిజ్ఞానం, అధునాతన ఆయుధాలు, అణ్వస్త్రాలు, జీవ రసాయనిక ఆయుధాలు, పుంఖాను పుంఖా లుగా తయారై, విస్తరిస్తున్న ప్రస్తుత సమయంలో... అవన్నీ తీవ్రవాదుల చేతుల్లో పడకుండా జాగ్రత్త వహించాల్సిన నైతిక బాధ్యత ప్రపంచ దేశాలన్నింటిపైనా ఉంది. ప్రపంచంలోని ధనిక దేశాల బాధ్యత మరింత ఎక్కువ. పేదరికంతో మగ్గుతున్న దేశాలకు.. తమ శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని, తమ సంపదలో కొంత భాగాన్ని అందించి... ఆయా దేశాల్లో ఉగ్రవాదమనే మొక్కకు ఎరువులా పని చేస్తున్న పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత లాంటి సమస్యల పరిష్కారానికి కృషిచేయటం ఎంతైనా అవసరం. ప్రపం చంలో ఉగ్రవాదం ఏ మూలనున్నా సరే... దాని దుష్ఫలితాలు ప్రపంచం నలుమూలలా వ్యాపిస్తాయన్నది నిర్వివాదాంశం.

ఉగ్రవాదమనేది ఏ ఒక్క ప్రాంతానికో, మతానికో, జాతికో పరిమితమైంది కాదు. మార్టిన్ లూథర్ కింగ్‌ను, జాన్ కెన్నడీని, అబ్రహంలింకన్‌ను చంపింది.. అమెరికా పౌరులే. జాతిపిత గాంధీజీని హత్య చేసింది.. ఒక హిందూ మతోన్మాదే. ఈజిప్టులో సదాత్ (ఒక గొప్ప ముస్లిం జాతీయ నాయకుడు) ను చంపింది.. ఒక ముస్లిం మతోన్మాదే. ఇజ్రాయెల్‌లో ఇజ్రయెల్, పాలస్తీనాల మధ్య శాశ్వత శాంతి కోసం అపార కృషి చేసిన ఇజ్జాక్ రబ్బీన్‌ను హత్య చేసింది పాలస్తీనాకు చెందిన హమాస్ తీవ్రవాది కాదు.. ఇజ్రాయెల్‌కు చెందిన ఒక యూదు మతోన్మాదే. దీని సారాంశం ఏమిటంటే.. తీవ్రవాదమనేది పంట చేలల్లో కలుపు మొక్కల్లా... ప్రతి సమాజంలోనూ తన ఉనికిని ఏర్పాటు చేసుకుంది. కలుపు మొక్కల్ని నాశనం చేయటానికి కలుపు నివారణ మందుల్లా... ఉగ్రవాదాన్ని నిరోధించటానికి జాతీయ స్థాయిలో POTA (Prevention of Terrorism Act).. అంతర్జాతీయ స్థాయిలో POTA లాంటి కఠినమైన చట్టాలు అవసరం. అంతేకాక కలుపు మొక్కలను ఎదగనివ్వకుండా.. బలంగా పెరిగే పంట మొక్కలుగా బలమైన ఆర్థిక సామాజిక, రాజకీయ వ్యవస్థలు అవసరం. అప్పుడే సెప్టెంబర్ 11 లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించగలుగుతాం!!

SAKSHI